క్లుప్తంగా

కొత్త డీఆర్వోకు అభినందనలు



డీఆర్వో రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిసిన డీఈవో బాషా, అధికారులు

అమలాపురం టౌన్: జిల్లాకు నూతనంగా నియమితులైన డీఆర్వో బి.రాజకుమారిని డీఈవో షేక్ సలీమ్ బాషాతో పాటు పలువురు విద్యాశాఖ అధికారులు స్థానిక కలెక్టరేట్‌లో శనివారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఆర్వో రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని డీఈవోకు చెప్పారు. డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు డీఆర్వోని కలిసిన వారిలో ఉన్నారు.

నవోదయ పరీక్షకు 297 మంది హాజరు

యానాం: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 427 మందికి గానూ 297 మంది అభ్యర్థులు హాజరయ్యారని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంజీజీబీహెచ్ బాలుర హైస్కూల్ సెంటర్‌లో 158 మంది, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ సెంటర్‌లో 139 మంది హాజరయ్యారని మొత్తం మీద ప్రవేశపరీక్షకు 130 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రత్నప్రభ, జెఎస్‌వీ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

బాపన్న కుటుంబానికి పరామర్శ

అమలాపురం టౌన్: కలసి చదువుకున్న తన చిననాటి స్నేహితుడైన అమలాపురం పట్టణానికి చెందిన స్టాంపు వెండర్ సహాయకుడు కోటిపల్లి బాపన్న మృతి తనను ఎంతగానో బాధించిందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, ఆలకు రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో పోటెత్తిన బస్టాండ్



అమలాపురం బస్టాండ్‌లో రిజర్వేషన్ కౌంటర్ల వద్ద బారులు తీరిన ప్రయాణికులు

అమలాపురం రూరల్: సంక్రాంతి సెలవులకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు తిరుగు ప్రయాణమవ్వడంతో అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో పోటెత్తింది. దాదాపు అందరూ ఒకేసారి తిరుగు ప్రయాణం కోసం బస్సులెక్కేందుకు ఎగబడడంతో శనివారం ప్రాంగణమంతా కిటకిటలాడింది. హైదరాబాద్, విశాఖ, విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లేవారు అమలాపురం బస్ స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ల వద్ద బారులు తీరి కనిపించారు. బస్టాండ్ కిక్కిరిసిన ప్రయాణికులతో నిండింది. గురువారం ముక్కనుమ కావడం, శుక్రవారం ప్రయాణాలు మంచిది కాకపోవడంతో అంతా శనివారం ప్రయాణాలు పెట్టుకున్నారు. హైదరాబాద్, గుంటూరు, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేశారు.

డ్రైవర్లకు కంటి పరీక్షలు



శిబిరంలో డ్రైవర్లకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అమలాపురం రూరల్: జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అమలాపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రాంగణంలో శనివారం లారీ, ఆటో డ్రైవర్లకు కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది డ్రైవర్లకు రక్తపోటు, కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి దుర్గారావు దొర డ్రైవర్లకు మెడికల్ ఫిట్ నెస్ విషయంలో తీసుకోవలసిన ఆరోగ్య పరమైన జాగ్రత్తలను సూచించారు. రోడ్ సేఫ్టీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు, ఎంవీఐలు కె.ఆర్. రవికుమార్, జ్యోతి, సురేష్, లారీ ఓనర్స్ సంఘం అధ్యక్షుడు నల్లా రాంబాబు, రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు అరిగెల రామారావు, కిమ్స్ హాస్పిటల్ ఏవో రఘు, వైద్య బృందం పాల్గొన్నారు.

రైతు చూపు.. వలస కూలీ వైపు!

- స్థానిక కూలీలకు తగ్గిన ఆదరణ
- కోనసీమలో బెంగాలీ కూలీల హవా
- సమయం, ఖర్చు ఆదా అవుతాయంటున్న అన్నదాతలు



గొల్లవిల్లిలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ వలస కూలీలు

ఉప్పలగుప్తం: వ్యవసాయమే జీవనోపాధిగా ఎంచుకున్న రైతుకు జీవనం సజావుగా ముందుకు సాగాలంటే లాభసాటి వ్యవసాయ పద్ధతులు అనివార్యంగా మారాయి . వ్యవసాయాధారిత ప్రాంతమైన కోనసీమలో రైతన్నకు వరి సాగే ప్రధాన ఆధారం. అయితే ఏటేటా పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా అరుగాలం శ్రమించి పండించిన పంట ఇంటికి చేరేవరకూ ఏం జరుగుతుందోనన్న బెంగ వారిని వేధిస్తూనే ఉంది. మరోవైపు వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో స్థానికంగా కూలీల కొరత ఏర్పడి కూలీ రేట్లు ఒక్కసారిగా పెరిగి పోతున్నాయి. దీంతో ఖర్చులను తగ్గించుకోవటానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి వస్తున్న వలస కూలీలతో పనులు చేయించుకోవడానికి అన్నదాతలు ప్రాధాన్యమిస్తున్నారు. వీరైతే సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయని అన్నదాతలు చెబుతున్నారు.

అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో సుమారు 19, 300 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకు 23 శాతం నాట్లు మాత్రమే పూర్తయ్యాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో దాదాపు 23,000 ఎకరాల్లో వరిసాగు జరుగుతుండగా 60 శాతం నాట్లు పూర్తయ్యాయి. ఏటేటా ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగి సాగు చేయాలంటే భయపడే పరిస్థితి కనిపిస్తుంది. గతంలో ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు పెట్టుబడికి ఖర్చయ్యేది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు పెరగడంతో ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకూ పెట్టుబడి ఖర్చవుతోంది. వీటికి తోడు కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్‌లు దిగక, మరి కొన్ని ప్రాంతాల్లో సాగుకు నీరు అందక ఇంజిన్‌లతో తోడుకోవటంతో రైతు అధిక ఖర్చుల భారిన పడుతున్నారు. మరోవైపు వ్యవసాయ పనుల సమయంలో అధిక వ్యయం వెచ్చించినా సమయానికి కూలీలు దొరకడం లేదు. దీంతో గత కొన్నేళ్లుగా అమలాపురం, అల్లవరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం తదితర మండలాల రైతులంతా బెంగాలీ కూలీల వైపు మొగ్గు చూపిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న వలస కూలీలు పనిలో వేగం, నాట్లు వేయడంలో విభిన్న పద్ధతులు అవలంబిస్తుండటంతో ఖర్చు సగానికి సగం తగ్గి పోతుండడంతో రైతులంతా వారికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

వ్యత్యాసం ఇదే..

స్థానిక కూలీలైతే ఎకరానికి 13 నుంచి 15 మంది ఆడవారు, నలుగురు మగవాళ్లు నాట్లు వేయడానికి, నారు తీయడానికి అవసరమవుతున్నారు. వీరికి నాట్లు వేయడానికి ఎకరానికి రూ.8వేల నుంచి రూ.8,500 వరకూ రైతులు చెల్లిస్తున్నారు. స్థానిక కూలీలు రోజుకు ఎకరం నుంచి ఎకరాన్నర మాత్రమే నాట్లు వేస్తారు. అదే వలస కూలీలైతే 10 నుంచి 12 మంది ఒక జట్టుగా ఏర్పడి తెల్లవారు జామున 5 గంటలకే పని ప్రారంభించి రోజుకు ఐదు ఎకరాల్లో నాట్లు వేస్తున్నారు. పైగా నారు లాగుకునే బాధ్యత సైతం వారిదే. దీని నిమిత్తం వీరు తీసుకునేది ఎకరానికి రూ.4300 మాత్రమే. స్థానిక కూలీలు ఎకరానికి 40 పోగులకు పైగా నారు వినియోగిస్తుంటే బెంగాలీ కూలీలు మాత్రం ఎకరానికి 15 నుంచి 20 పోగుల నారుతోనే నాట్లు వేసేస్తున్నారు. బెంగాలీ కూలీలు నాట్లు వేసే విధానంతో పంటకు తెగుళ్ల బెడద తగ్గడంతో పెట్టుబడులు కూడా ఆదా అవుతున్నాయని, అధిక దిగుబడి ఇస్తుందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి పెరుగుతోంది



స్థానిక కూలీలకు ఉపాధి కల్పించాలని మాకు అనిపిస్తున్నా ప్రస్తుతం ఉన్న ఖర్చుల రీత్యా వారితో పనులు చేయించలేక పోతున్నాం. మేము గత ఆరేళ్లుగా బెంగాలీ వలస కూలీలతో నాట్లు వేయిస్తున్నాం. దీని వల్ల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయి. వలస కూలీలు దూరం దూరంగా నాట్లు నాటడంతో బాగా దుబ్బు చేసి ఎకరానికి ఐదారు బస్తాల దిగుబడి వ్యత్యాసం కనిపిస్తుంది.

–నల్లా వెంకట నారాయణ రైతు, వాడపర్రు, ఉప్పలగుప్తం మండలం

ఉపాధి కోల్పోతున్నాం



బెంగాలీ కూలీలతో ఉపాధి కోల్పోతున్నాం. తక్కువ రేటుకే పనులు చేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న కూలీలకు ఉపాధి లేకుండా పోతుంది. వరి పనులకు మహిళలకు రూ. 350, మగవారికి రూ. 600 ఇస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరల రీత్యా ఈ కూలీ గిట్టుబాటు కావడం లేదు. రైతులు బెంగాలీ కూలీలపై ఆధారపడుతున్నారు. దీంతో స్థానిక కూలీలు తీవ్రంగా నష్ట పోతున్నారు.

యాండ్ర సత్యవతి, దేవగుప్తం, అల్లవరం

పేదలకు అన్నదానం

అమలాపురం టౌన్: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పేదలకు శనివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రయానికి పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ అతిథిగా పాల్గొని అన్నదానం నిర్వహించారు. ఏఐసీసీ ఆహ్వాన కమిటీ సభ్యుడు, మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పుట్టిన రోజు సందర్భంగా పేదలకు ఈ వితరణ కార్యక్రమం చేపట్టినట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు బాబి తెలిపారు. స్థానిక హరి మనో వికాస దివ్యాంగుల కేంద్రంలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు బిస్కెట్లు, పండ్లు పంచి పెట్టారు. ఏఐసీసీ, పీసీసీ నాయకులు యార్లగడ్డ రవీంద్ర, డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు, పోలిశెట్టి హరిబాబు, పేరి శర్మ, జోగి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారానికి నల్లా ఎంపిక

అమలాపురం టౌన్: తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి అమలాపురానికి చెందిన కవి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి ఎంపికయ్యారు. వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రతిభా పురస్కారాలకు కవి నల్లాను ఎంపిక చేసినట్లు ఆ సంస్థల ప్రతినిధులు ఆయనకు పంపించిన ధృవీకరణ పత్రంలో పేర్కొన్నారు. ఈ నెల 21న విజయవాడలో జరగనున్న పురస్కారాల ప్రదానోత్సవ సభలో కవి నల్లా ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. పురస్కారానికి ఎంపికైన కవి నల్లాను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు అభినందించారు.

హెల్మెట్ ధరించినా కబళించిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో వైద్యునికి తీవ్ర గాయాలు
- కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి



ప్రమాదంలో మృతి చెందిన యానాం ప్రభుత్వాస్పత్రి వైద్యుడు నాయక్

తాళ్లరేవు/యానాం: జాతీయ రహదారిలోని కోరంగి వంతెన దిగువన పటవల వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యానాం ప్రభుత్వాస్పత్రి వైద్యుడు పోపావత్ వెంకటేశ్వర నాయక్(36) దుర్మరణం పాలయ్యారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు యానాం ప్రభుత్వాస్పత్రిలో వైద్యునిగా పనిచేస్తున్న నాయక్ శుక్రవారం విధులు ముగించుకొని బైక్‌పై కాకినాడ బయలుదేరారు. ఈ క్రమంలో కోరంగి వంతెన దిగువన కాకినాడ నుంచి యానాం వైపునకు వెళుతున్న గూడ్స్ ఆటో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నాయక్ పొట్టపై గాయమై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో ఒక కుమారునికి ఎనిమిది నెలల వయస్సు కావడం పలువురిని కంట తడికి గురి చేస్తోంది. ప్రకాశం జిల్లా మల్లపాలెం నారాజముల తండాకు చెందిన వెంకటేశ్వర నాయక్ వైద్యునిగా పాండిచ్చేరిలో పనిచేసేవారు. ఏడాది క్రితం ఆయన యానాం ప్రభుత్వాస్పత్రికి బదిలీపై వచ్చారు. కాకినాడలో నివాసం ఉంటున్న నాయక్ ప్రతిరోజూ బస్సు మీద డ్యూటీకి వచ్చేవారు. అయితే పలు కారణాలతో బైక్‌మీద వచ్చిన ఆయన్ని హెల్మెట్ ధరించినప్పటికీ మృత్యువు కాటేసింది. ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మరో వ్యక్తి ఉమకా వెంకటేశ్వరరావు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

మృతుని నేత్రాల సేకరణ

తాళ్లరేవు: ఎల్ఐసీ చీఫ్ అడ్వైజర్ పంపన ప్రసాద్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేసినట్లు సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ తెలిపారు. మృతుడి కార్నియాలను ఐ బ్యాంకు టెక్నీషియన్ రవి సేకరించారు. ప్రసాద్ మృతి పట్ల బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, కాటాడి రమేష్, చోడే శ్రీనివాస్, బొంతు మోహన్, దొరబాబు తదితరులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అతివేగం వద్దు.. ట్రాఫిక్ నియమాలే ముద్దు



అమలాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ ఇంజినీర్లు

అమలాపురం టౌన్: అతివేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు బాధ్యులు కావద్దని సీపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ పులి రామకృష్ణారెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లో జరిగిన రహదారి భద్రతా వారోత్సవాల ర్యాలీని శనివారం ఉదయం ప్రారంభించి ప్రసంగించారు. వాహనాలు నడిపే చోదకులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తూ అప్రమత్తతతో డ్రైవింగ్ చేస్తే సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చని వారు సూచించారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద నుంచి ఎన్టీఆర్ మార్గ్ మీదుగా నల్ల వంతెన వరకూ కిలోమీటరు మేర ర్యాలీ సాగింది. పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి అన్యం రాంబాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల తనకు సంభవించిన ఓ రోడ్డు ప్రమాదాన్ని ఉదాహరణగా వివరించి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ర్యాలీలో పీఆర్ డీఈఈలు పీఎస్ రాజ్‌కుమార్, చంద్రశేఖర్, ఏఈఈలు సుజాత, చలం, సత్యనారాయణ, కొండలరావు, సంధ్య, పీఆర్ డివిజన్ కార్యాలయం మేనేజర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



అమలాపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 29వ వర్థంతిని స్థానిక గడియారం స్తంభం సెంటరులో నియోజకవర్గ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు తదితరులు ఆ సెంటరులో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు, వెంకటేశ్వరస్వామి ఆలయం ధర్మకర్త కుంచె వెంకన్నబాబు, సుబ్బాలమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యుడు యర్రంశెట్టి మూర్తి తదితరులు దివంగత ఎన్టీఆర్ సేవలను గుర్తు చేసి ఆయనకు నివాళి అర్పించారు.

ముమ్మిడివరం: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఎన్టీ రామారావు 29వ వర్ధంతిని శనివారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువుగట్టున ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కూటమి నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, ఆర్థాని శ్రీనివాసరావు, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజి, దాట్ల బాబి, యాళ్ల ఉదయ్, గోదాసి గణేష్, కాశి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఉప్పలగుప్తంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఉప్పలగుప్తం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ ఏడీఏ ఎంఏ షంషి అన్నారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో ఎం.మూర్తి, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్, ఏపీవో వి.రాజామణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ కోరారు. శనివారం మండల కేంద్రమైన తాళ్లరేవు పెంకేవారిపేట శ్మశాన వాటికలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. పారిశుధ్య కార్మికులు, ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. పి.మల్లవరం, పోలేకుర్రు, సుంకరపాలెం తదితర పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలలో రెడ్డిబాబు, పంపన రామకృష్ణ, టి.వేణుగోపాల్, వెంకటరమణ, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోడసకుర్రులో స్వచ్ఛ దివస్

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో స్వచ్ఛాంధ్ర , స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. గ్రామస్తులకు తడి, పొడి చెత్తలను వేరు చేసేందుకు ప్లాస్టిక్ బాస్కెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దొమ్మేటి శ్రీశాంతి భవాని, అమలాపురం నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాంబాబు, పరిపాలనాధికారి లక్ష్మణరావు, ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, ఏపీఎం సయ్యద్, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం



అమలాపురంలో ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి వ్యక్తి విధిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయటం ద్వారా వారి కుటుంబాలు సురక్షితంగా ఉంటాయని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో ద్విచక్ర వాహన చోదకులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. పట్టణ ఎస్సైలు శ్రీనివాస్, తిరుమలరావు, ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను డ్రైవింగ్ సమయంలో విస్మరించవద్దని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాహన చోదకులకు హెల్మెట్లు ధరింపజేసి వాటిని వినియోగించడం వల్ల చేకూరే ప్రయోజనాలను ప్రత్యక్షంగా పోలీసు అధికారులు చూపించారు. కార్యక్రమంలో ద్విచక్ర వాహన చోదకులే కాక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు

కోర్టు ఆదేశానుసారం మరో చోట ఏర్పాటు చేసిన యువకులు



అంబేడ్కర్ విగ్రహాన్ని తీసుకెళ్తున్న పాలమూరివారిపేట యువకులు

అల్లవరం: ఎంట్రుకోన పంచాయతీ పరిధిలోని ఈటివారిపాలెం కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని అనుకుని ఇరిగేషన్ స్థలంలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పోలీసుల సమక్షంలో శనివారం తొలగించారు. అనధికారికంగా ఏలాంటి అనుమతులు తీసుకోకుండా పాలమూరి వారిపేటకు చెందిన యువత ఆధ్వర్యంలో 2021లో అంబేడ్కర్ విగ్రహాన్ని రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికంగా నివాసం ఉంటున్న వాసర్ల మహాలక్ష్మి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు గత ఏడాది జూన్ 9 న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలని తీర్పు ఇచ్చింది. నాలుగు నెలలో వ్యవధిలో విగ్రహాన్ని తొలగించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలలో రెవెన్యూ, పోలీస్ అధికారులు పలుమార్లు సంప్రదింపులు నిర్వహించి చివరకు విగ్రహం తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలగించిన విగ్రహాన్ని తమ ప్రాంతంలో ఆవిష్కరిస్తామని పాలమూరివారిపేటకు చెందిన యువకులు తెలిపారు. యువకుల సమయస్ఫూర్తిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావు, ఎస్సై హరీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పనైనా చూపండి.. తిండైనా పెట్టండి

వలంటీర్లను ఆదుకోవాలని సీపీఐ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు

అమలాపురం టౌన్: వలంటీర్లకు పనైనా చూపండి లేదా వారికి తిండైనా పెట్టండని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సమావేశం స్థానిక రాష్ట్రోపాధ్యాయ సంఘ కార్యాలయంలో శనివారం జరిగింది. ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ ఉగ్గిరాల సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సత్తిబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 25, 26 తేదీల్లో అమలాపురంలో జరగనున్న ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల్లో వలంటీర్ల సమస్యలపై ప్రధాన చర్చ సాగనుందని తెలిపారు. వార్డు, గ్రామ సచివాలయాల పరిధుల్లో పనిచేసిన వలంటీర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు ఇచ్చిన హామీ మేరకు వారిని కొనసాగిస్తూ రూ.10 వేల వేతనం ఇవ్వాలని లేదా వారికి ప్రత్యామ్నాయ భృతి చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సూచించారు.

గంగమ్మతల్లి ఆలయానికి రూ.లక్ష విరాళం



గంగమ్మతల్లి ఆలయంలో విరాళం అందజేస్తున్న దాత వర్మ

యానాం: జాతీయ రహదారి చెంత సూర్యనగర్‌లో కొలువైన శ్రీ దొడ్డి గంగమ్మతల్లి అమ్మవారి ఆలయ గ్రిల్స్ నిర్మాణానికి శనివారం ఐ పోలవరం మండలం కొమరగిరికి చెందిన జంపన వెంకట సూర్య సుబ్రహ్మణ్యేశ్వర వర్మ, ఉషారాణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీకి అందించారు. దాతకు కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కోన కొండబాబు, ప్రతినిధులు రామచంద్రరావు, సూరిబాబు, తోట బైరవస్వామి, చిక్కాల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

అమలాపురం రూరల్: అమలాపురం–పేరూరు బైపాస్ రోడ్డు జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్ బాబు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఆమని ఆటోమొబైల్స్ బైపాస్ జంక్షన్ వద్ద వాహన దారుల రికార్డులు తనిఖీ చేశారు. వాహన దారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా జాగత్తలు పాటించాలని కోరారు.

అయినాపురం వీఆర్‌ఏ మృతి

ముమ్మిడివరం: మండల పరిధిలోని అయినాపురం గ్రామ వీఆర్‌ఏగా పని చేస్తున్న మోకాటి సుదర్శనం శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి మండల కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్‌ఏలు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

PUBLIC NOTICE

Sri Dangeti Siva Srinivas, S/o. Brahmanandam, D No 6-101/1, Settipeta, Anathavaram, Mummidivaram Mandal, Dr BR Ambedkar Konaseema Dist I applied for loan from M/s. Shriram Finance Ltd., Chennai, having branch office at Ravulapalem the security of the schedule mentioned property of him. If anybody has objection or attachments or any other interests over the properties should inform to the undersigned within 7 days from this day. Dr BR Ambedkar Konaseema Dist., Amalapuram SRO, Anathavaram village, Mummidivaram Mandal Z Dry, R S No 344/2 an extent of 330.7 sq yds is bounded by E: Site of Dangeti Devi Prakash, S: Land of Dangeti Sreerama Murthy, W: house of executants, N: 4 feet width joint passage in between the above boundaries with all easement rights etc., there.

D.V.V.S.MURTHY
Advocate
Date: 31-12-2024 Amalapuram. [illegible]